ఈనాడు
కుమురం భీం

శుక్రవారం అక్టోబరు 25, 2024

ఇసుక అక్రమ రవాణా కట్టడిపై దృష్టి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లాలో అనుమతి లేకుండా వాగులు, నదుల నుంచి ఇసుక అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దాసరి వేణు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, గ్రామీణ నీటి సరఫరా, రవాణా, పంచాయతీరాజ్, మైనింగ్, భూగర్భ జలశాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పేదలు నిర్మించుకునే ఇళ్లకు, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలు, ప్రభుత్వం చేపట్టే పనులకే ఇసుకను ఉచితంగా అందిస్తున్నామన్నారు. జిల్లాలోని పది మండలాల్లోని గ్రామాల్లో ఇసుక లభ్యం అవుతోందన్నారు. సాయంత్రం 6 నుంచి ఉదయం 6 గంటల వరకు ఇసుక రవాణా నిబంధనలకు విరుద్ధమని చెప్పారు. ఈ సమయంలో జిల్లా కమిటీ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి అక్రమంగా తరలించే వాహనాలను సీజ్ చేయాలన్నారు. పెద్ద వంతెనలు, ఆనకట్టలు, చెరువుల వద్ద 500 మీటర్ల లోపు ఇసుకను తోడితే కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లా నుంచి మహారాష్ట్రలోని చంద్రాపూర్, మంచిర్యాల, ఆదిలాబాద్ ప్రాంతాలకు ఇసుక తరలించే వాహనాలను తనిఖీ చేయాలన్నారు. రెబ్బెన, సిర్పూర్(టి), వాంకిడి, ఆసిఫాబాద్‌లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఇసుక డంపులను స్వాధీనం చేసుకుని బహిరంగ వేలం వేయాలని పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలించే వాహనాలకు జరిమానా వేయాలని ఆదేశించారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.


అధికారుల సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా

పోరుబాట.. అన్నదాతకు బాసట

- కేటీఆర్ సభతో భారాసలో ఉత్తేజం
- గుజరాత్ తరహాలో పత్తికి మద్దతు ధర ఇచ్చే వరకు పోరాడతామని వెల్లడి..


హాజరైన జనం


సభలో అభివాదం చేస్తున్న కేటీఆర్

ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందంటూ.. భారాస ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పట్టణం రాంలీల మైదానంలో గురువారం నిర్వహించిన రైతు పోరు బాట సభ ఆ పార్టీలో ఉత్తేజం నింపింది. సభ కోసం ఆదిలాబాద్ నియోజకవర్గంలోని రైతులను, ప్రజలను ఎక్కువ సంఖ్యలో తరలించారు.. బోథ్ నియోజకవర్గ పరిధిలోని చుట్టుపక్కల గ్రామాల నుంచి సైతం తరలివచ్చారు. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఉదయం 11.30 గంటలకు హాజరవుతారని చెప్పడంతో అనుకున్న సమయానికి ముందే జనం అక్కడికి చేరుకున్నారు. మేడ్చల్‌లో ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడం, డిచ్‌పల్లి వద్ద రహదారిపై పోలీసు కుటుంబాల ఆందోళనకు మద్దతు ఇవ్వడం, మధ్యలో కార్యకర్తల సన్మానాలతో ఆయన మధ్యాహ్నం 1.30కు సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఇదే విషయాన్ని సభలో వెల్లడించారు. ప్రజలు ఓపిగ్గా ఉన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. రైతులు భూమారెడ్డి, జనార్దన్‌లు రుణమాఫీ, రైతు భరోసా ఆలస్యంపై రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి ఆలోచింపజేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై విమర్శలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే లక్ష్యంగా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని దుయ్యబట్టారు. జిల్లా కేంద్రంలో మూతపడ్డ సిమెంటు పరిశ్రమను పునరుద్ధరిస్తామని చెప్పి గెలుపొందిన భాజపాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యే ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. రాజీవ్ కాలంలో ఆదానీ సీసీఐని అమ్మేస్తారని పేర్కొన్నారు. సింగరేణిపైనా ఆదానీ గురిపెట్టారని, సీఎం రేవంత్‌రెడ్డి ఆయనకు పూర్తి సహకారాలు అందిస్తున్నారని ఆరోపించారు.

మేం అధికారంలోకి వచ్చాక ఏకపక్షంగా వ్యవహరించే వారికి మిత్తితో సహా చెల్లిస్తామని హెచ్చరించారు. జిల్లాలో ఇలా వ్యవహరించే అధికారులు, పోలీసుల పేర్లు రాసుకోవాలని జోగురామన్నకు సూచించారు.


కేటీఆర్‌కు నాగలి బహూకరిస్తున్న నాయకులు, చిత్రంలో రామన్న, అనిల్‌జాదవ్, జనార్దన్ రాఠోడ్

ఆదిలాబాద్‌లో నాణ్యమైన పత్తి

గుజరాత్‌లో పత్తికి క్వింటాలుకు రూ.8,800 ఇస్తే ఆదిలాబాద్‌లో మాత్రం అదే భారత పత్తి సంస్థ తక్కువ ధర ఇవ్వడం విడ్డూరమంటూ కేటీఆర్ దుయ్యబట్టారు. ఆదిలాబాద్ పత్తి రైతులకు గుజరాత్ తరహాలో ధర లభించే వరకు పోరాడుతూనే ఉంటామని, భాజపాకు చెందిన స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేను ప్రశ్నిస్తూనే ఉంటామని భరోసా ఇచ్చారు.

కార్యకర్తలంతా రైతు కల్లాల దగ్గర వెళ్లి అండగా ఉండాలని పిలుపునిచ్చారు.

సమంజసం కాదు..

రుణమాఫీ కాలేదని తలమడుగు మండలం రుయ్యాడిలో సీఎం దిష్టిబొమ్మ దహనం చేసే రైతులపై కేసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమంటూ కేటీఆర్ ప్రశ్నించారు. హైడ్రా పేరిట ఆదిలాబాద్‌లోని ఖానాపూర్ చెరువు వద్ద ఇళ్లు కూలగొడితే దుకు మార్పు, వేసేందుకు వస్తే సీఎంను దూషించారని గంగన్న అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారన్నారు. మరి వంద రోజుల్లో పథకాలు అమలుచేస్తామని చెప్పి మోసగించిన సీఎంపై ఫిర్యాదు చేస్తే కేసు ఎందుకు నమోదు చేయడం లేదంటూ ప్రశ్నించారు.

అన్ని నియోజకవర్గాల్లో..

రైతులకు న్యాయం చేయాలంటూ, భరోసా ఇవ్వాలని జోగురామన్న రైతు పోరు బాట కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పోరుబాట ఉంటుందని వెల్లడించారు. కార్యాచరణ సిద్ధం చేయాలని వేదికపై ఉన్న వివిధ నియోజకవర్గాల నేతలకు కేటీఆర్ సూచించారు. భారాస జిల్లా అధ్యక్షుడు జోగురామన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బోథ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యేలు అనిల్‌జాదవ్, కోవలక్ష్మి పాల్గొన్నారు. కేటీఆర్ వెంట హుజూరాబాద్, కోరుట్ల ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, సంజయ్‌లు సభకు హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, బాల్కసుమన్, జడ్పీ మాజీ ఛైర్మన్ రాఠోడ్ జనార్దన్, మున్సిపల్ ఛైర్మన్ ప్రేమేందర్, నాయకులు జాన్సన్ నాయక్, తుల శ్రీనివాస్, లోలంశ్యాంసుందర్, చారులత, రౌతు మనోహర్, సతీష్‌పవార్, మార్‌శెట్టి గోవర్ధన్, యూనుస్ అక్బానీ, అజయ్, సాజిదొద్దీన్, మనీషా, స్వరూప, మమత, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

నాపై ఎన్ని కేసులైనా పెట్టుకోండి

జోగు రామన్న, భారాస జిల్లా అధ్యక్షుడు

బేలలో సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారని నాపై కేసు పెట్టారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదు. ఉట్నూర్‌లో కేటీఆర్‌పై కేసు నమోదుకాక ముందే హామీల అమలులో మోసగించిన సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశాను. ఫలితం లేదు.

అన్నదాతలకు అప్పు దొరకడం లేదు


అనిల్‌జాదవ్ బోథ్ ఎమ్మెల్యే

సీఎం రేవంత్‌రెడ్డి అంటేనే ఒక మాటల గారడి. వర్షాకాలం రైతుభరోసా ఇవ్వలేదు. అక్టోబరు వచ్చినా ఇంకో భరోసా ఖాతాలో జమకాలేదు. కేసీఆర్ హయాంలో రైతుబంధు వస్తుందనే ఉద్దేశంతో ఖర్చుల కోసం రైతులు షావుకారు వద్దకు వెళితే అప్పుదొరికేది. కాంగ్రెస్ హయాంలో అన్నదాతలకు అప్పు పుట్టడం లేదు.

గంటల తరబడి కరెంటు కోతలు

కోవలక్ష్మి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే

కాంగ్రెస్ హయాంలో ఏ వర్గానికి న్యాయం జరగడం లేదు. రైతు భరోసా, పింఛను సొమ్ము పెంచుతామని మోసం చేశారు. గంటల తరబడి కరెంటు కోతలు విధిస్తున్నారు. మరోపక్క ఉచిత కరెంటు అంటూనే ఎవరికి వర్తింపజేయడంలేదు. పది నెలలు కావొస్తున్నా ఎక్కడా రోడ్డుపని సైతం మొదలెట్టలేదు.



అప్పనంగా అమ్ముతున్నారు..

- ఆసుపత్రి అక్రమాలకు అంతేది..

రెక్కలు ముక్కలు చేసుకుని జీవనం సాగించే కార్మికులు అనేక రకాల జబ్బుల బారిన పడుతుంటారు. చికిత్సల నిమిత్తం కార్మికశాఖ ఆసుపత్రికి వెళితే వీరికి రిక్త హస్తమే మిగులుతోంది. ఒక్క వైద్యుడు లేకపోగా, కనీసం మందులు సైతం అందుబాటులో ఉండకపోవడంతో కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు మాత్రల కోసం ప్రైవేటును ఆశ్రయించాల్సిన దుస్థితి దాపురిస్తోంది. చిన్నపాటి చికిత్సలకు సైతం సనత్‌నగర్ ఆసుపత్రికే రోగులను ఇక్కడి నుంచి పంపిస్తున్నారు. మరో వైపు రూ.5 లక్షల విలువైన మందులు కాగజ్‌నగర్ ఈఎస్ఐ ఫార్మసిస్టు మురళి కరీంనగర్ ఆసుపత్రికి విక్రయిస్తుండగా.. ఔషధ నియంత్రణ అధికారులు పట్టుకోవడం ఆసుపత్రి పనితీరును, సంబంధిత అధికారుల పర్యవేక్షణలోపాన్ని తేటతెల్లం చేస్తోంది.

ఈనాడు, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, న్యూస్‌టుడే

జిల్లా వ్యాప్తంగా 17 వేల మంది కార్మికులు ఉన్నారు. 2014-2018 వరకు కాగితం పరిశ్రమ మూతపడటంతో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్వహణ పూర్తిగా గాడితప్పింది. శిథిలావస్థకు చేరుకున్న భవనాన్ని కూలగొడతామని అధికారులు తీర్మానం చేసినా అమలు కాలేదు. ప్రస్తుతం అందులోనే కొనసాగిస్తున్నారు. ఇద్దరు వైద్యులు ఉండాల్సిన చోట ఒక్కరూ లేరు. కేవలం అయిదారుగురు సిబ్బందితోనే చికిత్సలు కానిచ్చేస్తున్నారు. నిత్యం ఇక్కడికి 80-100 వరకు కార్మికులు వివిధ వ్యాధులతో వస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నట్లుగా గుర్తిస్తే వారికి ఆసుపత్రిలో నెలకు సరిపడా మందులు ఒకేసారి ఇస్తారు. గుండెజబ్బులు, బీపీ, మధుమేహం ఉన్నవారికి ఒకేసారి మందులు పంపిణీ చేస్తారు. ఇవి బయట మార్కెట్‌లో ఎక్కువ ధర ఉంటాయి. ఇటువంటి వాటినే అక్కమార్కులు ప్రైవేటులో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

ఇంకా ఎందరు?

తొమ్మిది నెలల నుంచి ఇన్‌డెంట్ పెట్టలేదు. మాకు మందులేవి సరఫరా కాలేదని ఈఎస్ఐ ఆసుపత్రి పర్యవేక్షకులు జగన్ చెబుతున్నారు. ప్రత్యేక నిఘా ఉంచి మందులు తీసుకెళుతున్న వాహనాన్ని వెంబడించి కరీంనగర్‌లో మాత్రలు విక్రయిస్తుండగా పట్టుకున్నామని, ఇవి సెప్టెంబరులోనే ఆసుపత్రికి వచ్చాయని, స్టాక్‌లోని వ్యత్యాసం ఆధారంగానే అక్రమాలు జరిగాయని తెలుస్తోందని ఔషధ నియంత్రణ అధికారి అశ్విని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మందులు తరలిపోయే క్రమంలో సంబంధిత ఆసుపత్రి అధికారులు ఏం చేస్తున్నారు.. ఈ దందాలో ఇంకా ఎవరెవరు ఉన్నారు.. ఈ ఒక్కసారే విక్రయించారా.. మరో ప్రాంతంలో సైతం విక్రయాలు చేస్తున్నారా.. ఈ తంతు ఎప్పటి నుంచి కొనసాగుతుందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ఫార్మసిస్టుపై చర్యలు..

మందులు అమ్ముతూ దొరికిపోయిన ఫార్మసిస్టుపై చర్యలు తీసుకోవాలని ఔషధ నియంత్రణ అధికారులు సంబంధిత ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లుగా తెలిసింది. ఒకటి రెండు రోజుల్లో ఆయనను విధుల నుంచి తొలగించనున్నారు. ఈఎస్ఐ ఆసుపత్రి నుంచి మందుల విషయంలో జరిగిన అవినీతి గురించి త్వరలోనే అధికారులు పూర్తి వివరాలు వెల్లడించనున్నారు.

తెలంగాణ వైపు గజరాజు!



ఈనాడు, ఆసిఫాబాద్: మహారాష్ట్ర నుంచి జిల్లాలోని చింతలమానేపల్లి, పెంచికల్‌పేట్ మండలాలకు ఏప్రిల్ నెలలో వచ్చిన ఏనుగు ఇద్దరు రైతులను హతమార్చి బీభత్సం సృష్టించింది. రెండు రోజుల తర్వాత తిరిగి వెనక్కు వెళ్లడంతో ఊపిరిపీల్చుకున్నారు. కాగా ప్రస్తుతం అదే ఏనుగు చింతలమానేపల్లి మండలం దిందా అటవీ ప్రాంతానికి దాదాపు 30 కిలోమీటర్ల దూరంలో సంచరిస్తోందని మహారాష్ట్ర అధికారుల సమాచారంతో ఇక్కడి అధికారులు అప్రమత్తమయ్యారు. రెండు రాష్ట్రాల అధికారులు సమన్వయం చేసుకుంటూ ఏనుగు కదలికలను పర్యవేక్షిస్తున్నారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని, డ్రోన్ కెమెరాలు వినియోగిస్తామని, చింతలమానేపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్ మండలాల్లో ఏనుగు కదలికల పట్ల ప్రజలను నిత్యం అప్రమత్తం చేస్తున్నామని, ఏనుగు ఏ క్షణమైనా తెలంగాణ వైపు వచ్చే అవకాశాలు ఉన్నాయని.. డీఎఫ్ఓ నీరజ్‌కుమార్ పేర్కొన్నారు.

ప్రాణదాతలుగా నిలవండి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : రక్తదాతలు.. ప్రాణదాతలుగా నిలుస్తారని అదనపు ఎస్పీ అడ్మిన్ ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. పోలీసు అమరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా.. గురువారం జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్‌క్వార్టర్ వద్ద నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొని మాట్లాడారు. ఆపదలో ఉన్న వారికి సాటి మనిషిగా రక్తదానం కోసం ముందుకు రావాలన్నారు. రక్తదానంపై ఎలాంటి అపోహలు అవసరం లేదన్నారు. పోలీసులు, సాధారణ పౌరులు, యువత ముందుకొచ్చి రక్తదానంలో పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సిబ్బంది దాతల నుంచి రక్తం సేకరించారు. మొత్తం 51 యూనిట్లు సేకరించినట్లు అదనపు ఎస్పీ తెలిపారు. థలసీమియా, క్యాన్సర్, మెడికల్ ఎమర్జెన్సీ, హిమోఫీలియా, ప్రమాదాల్లో గాయపడ్డవారికి, రక్తహీనతతో బాధపడే వారికి ఈ యూనిట్లు ఎంతో మేలు చేస్తాయని చెప్పారు. అనంతరం దాతలకు పండ్లు, పానీయాలు పంపిణీ చేశారు. వారిని అభినందించి ప్రశంసా పత్రాలు అందించారు. కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, సీఐలు, ఎస్సైలు, వైద్య సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


రక్తదాన శిబిరంలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, సీఐలు, తదితరులు

రేపు వాలీబాల్ జోనల్ స్థాయి ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : పాఠశాల క్రీడల సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో శనివారం తిర్యాణి ఆశ్రమోన్నత పాఠశాలలో ఉమ్మడి జిల్లా జోనల్ స్థాయి అండర్-17 వాలీబాల్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు డీఈఓ యాదయ్య, ఎస్‌జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సాంబశివరావు గురువారం ప్రకటించారు. జిల్లా స్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సంతకం చేసిన నాలుగు సెట్ల ఎస్‌జీఎఫ్ ఫామ్స్, బోనఫైడ్ ఒరిజినల్ సర్టిఫికేట్స్, ఆధార్ కార్డుతో రావాలని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్‌ను చరవాణి నం.94923 24005 సంప్రదించాలన్నారు.

2016లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో రూ.10 లక్షలు మంజూరు కావడంతో చేపల విక్రయానికి ప్రత్యేకంగా మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభించారు. నిధులు సరిపోక పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అనంతరం రూ.10 లక్షలు రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయి. గుత్తేదారు పనులు చేపట్టడానికి ముందుకు రాలేదు.


మందమర్రిలో అసంపూర్తిగా ఉన్న చేపల మార్కెట్ భవనం

అపరిశుభ్ర వాతావరణంలో..

క్రిమికీటకాలు దరిచేరకుండా చేపలు, మాంసం కనీసం మూడు అడుగుల ఎత్తులో పరిశుభ్ర వాతావరణంలో అమ్మకాలు సాగించాల్సి ఉంటుంది. మిగిలిన వాటిని భద్రపరిచేందుకు రిఫ్రిజిరేటర్ వంటి సౌకర్యం అవసరం. కానీ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాదాపు అన్ని పురపాలికల్లో కనీస సౌకర్యాలు కరవయ్యాయి. చాలా ప్రాంతాల్లో చేపలను నేల మీద కూరగాయలు అమ్మిన విధంగా అమ్మకాలు సాగిస్తున్నారు. 2016లో దాదాపు అవకాశం ఉన్న అన్ని ప్రాంతాల్లో చేపల మార్కెట్ నిర్మాణాలకు అధికారులు ప్రణాళికలు రూపొందించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు.


మంచిర్యాలలో రహదారి పక్కన చేపలను విక్రయిస్తున్న మత్స్యకారులు

మీనం పుష్కలం..
అమ్మకం గగనం

- ఉమ్మడి జిల్లాలో మార్కెట్లు కరవు

లక్షెట్టిపేట, న్యూస్‌టుడే

చేపల విక్రయానికి ప్రత్యేకంగా మార్కెట్లు లేకపోవడంతో మత్స్యకారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు నీలి విప్లవం పేరిట ప్రభుత్వం వంద శాతం రాయితీపై చెరువుల, కుంటలు, రిజర్వాయర్లలో చేప పిల్లలను వదులుతుండగా వాటికి సరైన మార్కెటింగ్‌కు అవకాశం లేక ఇబ్బందులు తప్పడం లేదు. పాత పురపాలికల్లో కూరగాయల మార్కెట్లలో అమ్మకాలు సాగుతుండగా కొత్త పురపాలికల్లో ఇప్పటికీ తగిన ఏర్పాట్లు లేవు. పురపాలికల్లో సమీకృత మార్కెట్ల నిర్మాణం చేపట్టి ప్రత్యేకంగా స్టాళ్లు కేటాయిస్తామని ప్రభుత్వం నిర్మాణ పనులు చేపట్టగా అవి అసంపూర్తిగా మిగిలాయి.

మత్స్య సంపదకు అనుకూలం

ఉమ్మడి జిల్లాలో మత్స్యపరిశ్రమ అభివృద్ధికి అపారమైన అవకాశాలున్నాయి. చేపల పెంపకానికి అనువుగా మొత్తం 1,501 చిన్న నీటి వనరులను అధికారులు గుర్తించారు. 14 రిజర్వాయర్లలో ఇప్పటికే చేపల పెంపకం సాగుతోంది. గోదావరిపై నిర్మించిన ఎల్లంపల్లి జలాశయం మత్స్య పరిశ్రమకు ఊతంగా నిలుస్తోంది. దీని ద్వారా మత్స్య సహకార సంఘాల్లోని 19,150 కుటుంబాలు ప్రత్యక్షంగా లబ్ధి పొందుతున్నాయి. ఇతర ప్రాంతాలకు తరలించి అమ్ముకోవడానికి వీలుగా వాహనాలను రాయితీపై ప్రభుత్వం అందజేసినా ప్రత్యేకంగా కోల్డ్ స్టోరేజీకి అవకాశం లేకపోవడం, అన్ని హంగులతో మార్కెట్ల నిర్మాణం ఇంకా చేపట్టకపోవడం మత్స్యకారులకు ఇబ్బందికరంగా మారింది.


ఎల్లంపల్లిలో జాలర్లకు చిక్కిన 15 కిలోల చేప

జిల్లాలవారీగా వివరాలు ఇలా...

జిల్లా	మత్స్యకార సహకార సంఘాలు	మత్స్యకారులు	చెరువులు	రిజర్వాయర్లు	ఉత్పత్తి(టన్నుల్లో)
మంచిర్యాల	108	4,850	322	03	6,009
ఆదిలాబాద్	55	2,750	225	02	4,954
నిర్మల్	157	9,800	696	05	22,673
కుమురంభీం	35	1,750	258	04	5,178

అనాలోచిత నిర్ణయం.. కాలనీవాసులకు శాపం



గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయాల్సిన మద్యం దుకాణాలను ప్రశాంతంగా ఉన్న కాలనీ మధ్యలో ఏర్పాటు చేయడంతో నిత్యం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలోని విజయనగరం రోడ్డుకు ఇరువైపులా రెండు మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారు. వీటి ఏర్పాటు సరికాదని గతంలో పలుమార్లు కాలనీవాసులు విన్నవించినా అధికారుల ధోరణిలో మార్పు రాకపోవడంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎదురెదురుగా దుకాణాలు ఏర్పాటు చేయడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు మందుబాబులు రోడ్డుపైనే వాహనాలు నిలిపి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మత్తులో కొందరు యువకులు అకృత్యాలకు పాల్పడడం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే బాలికలు ఈ మార్గంలో నడవాలంటే జంకుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మద్యం దుకాణాలను జనావాసాల నుంచి తరలించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, కౌటాల**

పండగల వేళ పనిచేయని ఏటీఎంలు!



నజ్రూల్‌నగర్‌లోని ఎస్బీఐ ఏటీఎం

పట్టణంలో, నజ్రూల్ నగర్ ఎస్బీఐ ఏటీఎంలు పండగల వేళల్లో పనిచేయడం లేదు. ఖాతాదారులు నగదు కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నజ్రూల్‌నగర్‌లోని ఏటీఎం దసరా నుంచి ఇప్పటి వరకు పనిచేయకపోవడంతో సీఎస్సీ కేంద్రాలను ఆశ్రయించాల్సి వస్తోంది. నజ్రూల్‌నగర్ ఎస్బీఐ పరిధిలో కాగజ్‌నగర్ మండల వినియోగదారులే కాకుండా బెజ్జూర్, కౌటాల, చింతలమానెపెల్లి, పెంచికల్‌పేట తదితర మండలాల ఖాతాదారులు ఉన్నారు. సదూర ప్రాంతాల నుంచి నగదు కోసం వచ్చిన వారికి ఏటీఎంలు పనిచేయకపోవడంతో బ్యాంకులో నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కాగజ్‌నగర్ గ్రామీణం**

ఇక్కడా విజయం సాధించాలి..!!


పొన్కల్‌లో నూతన పశువైద్యాధికారిని సన్మానిస్తున్న గ్రామస్థులు

మామడ, న్యూస్‌టుడే:

ఈ పోటీ ప్రపంచంలో ఎవరికైనా ప్రభుత్వ ఉద్యోగం వచ్చిందంటే వారు ఎంతో ప్రతిభావంతులన్నట్లే. లక్ష్యం పెట్టుకొని ప్రణాళికతో చదివి తమ మేధస్సుతో ఇతరులకన్నా వేగంగా ముందుకెళ్లిన వారే అందరూ.. మూడు పదుల వయస్సుకు ముందే స్థిరమైన స్థానానికి చేరుకొని మంచి జీతంతో చక్కని జీవితాన్ని గడపొచ్చు. కళాశాల, తరగతి గది, శిక్షణ కేంద్రాలు, పుస్తకాలతో కుస్తీ వీటన్నింటినీ దాటుకుంటూ వెళ్లిన వారు జనాల మధ్యకు వచ్చేశారు. ఇప్పుడు ఓ కొత్త జీవితాన్ని ప్రారంభించారు. పాఠాల్లో చదివిన అంశాలే ఇక్కడ ఉండవు. కొత్త బాధ్యతలు నిర్వర్తించాలి. అప్పుడప్పుడు సవాళ్లూ ఉంటాయి. అంకితభావంతో పనిచేస్తే ఇక్కడా మీరు విజయం సాధించొచ్చు..

రాగానే స్వాగతం చెప్పారు చూడండి..

ఉమ్మడి జిల్లాలో 18 మంది పశువైద్యాధికారులు నియామకమయ్యారు. మామడ మండలం పొన్కల్ పశువైద్యాధికారిగా శ్రీహరి తాజాగా బాధ్యతలు స్వీకరించారు. పశువైద్య కళాశాలలో చదివి ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన తొలిరోజు ఆయనకు గ్రామస్థులు చక్కగా స్వాగతం పలికారు. పశుపోషకుల అవసరాలను గుర్తించి మంచి సేవలందిస్తే జనాలతో మరింత అనుబంధం పెరుగుతుంది.

విసుక్కోకండి..

అక్షరాస్యులు, నిరక్షరాస్యులు, నాయకులు.. ఇలా ఎన్నో వర్గాలతో కలిసి పని చేయాల్సి ఉంటుంది. ఉదాహరణకు వ్యవసాయాధికారినే తీసుకుంటే మండలం మొత్తానికి అధికారి. ఆ ఒక్కరి పరిధిలో వేలాది మంది రైతులు ఉంటారు. అతివృష్టి, అనావృష్టి, పంట సర్వేలు, పరిహారం చెల్లింపులు వంటి విషయాల్లో చాలా చురుకుగా పనిచేయాలి. ఈ క్రమంలో కొన్నిసార్లు ప్రతికూలతలు ఎదురవుతాయి. ఉద్యోగ సాధనలో కుంగుబాటుకు గురి కాకుండా ఆత్మవిశ్వాసంతో విజయం సాధించినట్లే ఇక్కడా మీ పనితనాన్ని చూపించాలి. ఎవరు ఎప్పుడు ఏ సమస్య చెప్పినా ఓపికగా వినాలి. విసుక్కోకుండా మనతో అయ్యే సాయాన్ని అందించాలి.



● ప్రతిభావంతులైన మీరు పనిమంతులవ్వాలి

గురువులుగా మీరు..

కొత్త ఉద్యోగుల్లో ఎక్కువ యువతే అధికం. ఎంతో కష్టపడి చదివి గురువులుగా మారిన వారు భవిష్యత్తు పౌరులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించాల్సి ఉంటుంది. అనుభవాలు.. ప్రతిభను రంగరించి విధి నిర్వహణలో అంకితభావం కనబరిస్తే శిష్యులు మంచి స్థానాలకు చేరుకుంటారు.


హస్నాపూర్ తండాలో విధులు నిర్వర్తిస్తున్న కొత్త ఉపాధ్యాయుడు సంపత్

వీలైతే పనిచేసే చోట ఉండండి..

కొత్తగా ఉద్యోగంలో చేరిన వారు ఉత్సాహంగా పనిచేయాలి. ఇందుకు మంచి అవకాశం పనిచేసే ప్రదేశంలో నివాసం ఉండటం. పల్లెల్లో పుట్టి పెరిగిన వారు పట్టణాల్లో నివాసం ఉండగలిగితే పల్లె ప్రజల ఆత్మీయతను చూరగొంటారు. సమయపాలన పాటించవచ్చు. వివాహమై కుటుంబ బాధ్యతలు పెరిగాక ఎలాగూ గ్రామీణ ప్రాంతాల్లో నివాసం ఉండలేరు.

ఓ సామాజిక కార్యకర్తగా భావించాలి:



రైతులు, ప్రజలకు సేవ చేసే అవకాశం ఓ ప్రభుత్వ ఉద్యోగిగా కొందరికే దక్కుతుంది. ఉద్యోగాన్ని కేవలం ఉద్యోగంగా మాత్రమే కాకుండా అంకితభావంతో నిర్వర్తిస్తే వచ్చే గుర్తింపు [illegible] పొందిన ఉంటుంది. సమాజం కోసం సామాజిక కార్యకర్తగా భావించి పనిచేయాలి. నా ఉద్యోగ నిర్వహణలో ఎన్నో ప్రాంతాల్లో పనిచేశాను. ఇప్పటికీ పనిచేసిన ప్రతి చోటు నుంచి నాకు ఫోన్ చేస్తుంటారు. వారిచ్చే గౌరవం, చూపించే ప్రేమ ఎన్ని డబ్బులు పెట్టినా కొనలేం. కేవలం ప్రభుత్వ ప్రతినిధులుగా మనం వారికి చేసే సేవలే సంతృప్తినిస్తుంది. -అశోక్‌కుమార్, వ్యవసాయ శాఖ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్

ఆ ఆనందమే వేరు..

మనీష, తానూరు మండల వ్యవసాయాధికారి

నేను మొదటి ఉద్యోగం మామడ మండలంలో ఏఈవోగా పనిచేశాను. తాజాగా ఏవోగా ఎంపికయ్యాను. క్షేత్ర స్థాయిలో రైతులకు అనేక ఇబ్బందులు ఉంటాయి. వారికి అందుబాటులో ఉండి అవసరమైన పనులు చేస్తే రైతుల కళ్లలో సంతోషం కనిపిస్తుంది. అప్పుడు కలిగే ఆనందాన్ని మాటల్లో చెప్పలేం. ఏదైనా మన పనితీరుతోనే గుర్తింపు లభిస్తుంది.


రైతుల వివరాలు సేకరిస్తూ..

పనిమంతులైతే గుండెల్లో నిలిచిపోతారు..

ఉపాధ్యాయులు, పశువైద్యాధికారులు, వ్యవసాయాధికారులు, ఏఈలు, ఎస్సైలు.. ఇలా వివిధ హోదాల వారు కొత్తగా విధుల్లో చేరారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖల్లో వెయ్యి మందికి పైగానే నూతన ఉద్యోగులు ఉన్నారు. ఇన్నాళ్లు ఓ వ్యక్తిగా తన ఇష్టాలకు అనువుగా ఉండొచ్చు. ఇప్పుడు మాత్రం వ్యవస్థ కోసం పనిచేయాల్సి ఉంటుంది. ప్రతిభావంతులుగా గుర్తింపు తెచ్చుకున్న వారు పనిమంతులై ఉత్తమ ఉద్యోగులుగా రాణిస్తే జనాల గుండెల్లో నిలిచి పోతారు.

జనవరి నాటికి ఆర్మూర్ రైల్వే మార్గంపై తుది నివేదిక : ఎంపీ


సమావేశంలో పాల్గొన్న ఎంపీ నగేష్

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్, నిర్మల్ జిల్లావాసులు ఎదురు చూస్తున్న ఆదిలాబాద్ - ఆర్మూర్ వయా నిర్మల్ రైల్వే మార్గం సర్వే జరుగుతోందని, తుది నివేదికను జనవరి 25లోగా రైల్వేబోర్డుకు సమర్పించనున్నట్లు ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ వెల్లడించారు. ఆదిలాబాద్ వరకు పలు రైళ్ల పొడిగింపుతో పాటు ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాసరలో మరిన్ని రైళ్లు ఆగేలా నివేదించినట్లు ఆయన పేర్కొన్నారు. గురువారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో ఎంపీలతో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజరు అరుణ్‌కుమార్ జైన్ సమావేశం నిర్వహించారు. ఆయా అంశాలను ప్రస్తావించగా.. జీఎం నుంచి సానుకూల స్పందన లభించినట్లు ఎంపీ వివరించారు. ఆదిలాబాద్ - గడ్‌చందూర్ మార్గం డీపీఆర్, అంచనా నివేదిక డిసెంబర్ 24లోగా రైల్వేబోర్డుకు ఇస్తామని, ఆదిలాబాద్‌కు రూ.17.76 కోట్లు, బాసరకు రూ.11.33 కోట్లు కేటాయించి అమృత్ స్టేషన్లుగా ఆధునికీకరిస్తామని అధికారులు సమాధానమిచ్చారని పేర్కొన్నారు. బల్లార్షా-కాజీపేట మార్గంలో రెబ్బెన వద్ద రోడ్డు ఓవర్‌బ్రిడ్జి, ముఖ్ఖేడ్ - పిప్పల్‌కోటి వరకు డబుల్‌లైన్ సర్వే చేసేందుకు చర్యలు తీసుకోనున్నారని తెలిపారు. నాందేడ్, నాగ్‌పూర్‌ల నుంచి తపోవన్, రాజారాణి, పుణె-నాందేడ్, బెంగళూరు, మరట్వాడ సంపర్క్ క్రాంతి, పన్‌వేల్, పుణె-నాందేడ్ రైళ్లను ఆదిలాబాద్ స్టేషన్ వరకు పొడిగించేందుకు అధికారులు అంగీకరించారన్నారు. విశాఖపట్నం - సాయినగర్, సికింద్రాబాద్-జైపూర్, రామేశ్వరం-బోకే, యశ్వంత్‌పూర్-ఇండోర్, తిరుపతి-అమరావతి, హైదరాబాద్-జైపూర్, తిరుపతి-అకోల నగరాల నడుమ నడిచే 8 రైళ్లు బాసర స్టేషన్‌లో ఆగేలా చూడాలని విన్నవిస్తే జీఎం సానుకూలత వ్యక్తం చేశారని ఎంపీ వివరించారు.

బంగారు దుకాణంలో దొంగతనం

● 5 కిలోల వెండి, రెండున్నర తులాల స్వర్ణం అపహరణ

కుభీరు, న్యూస్‌టుడే : కుభీరులోని "ఆకాశ్" బంగారు దుకాణంలో గురువారం వేకువజామున దొంగతనం జరిగింది. ఎస్సై రవీందర్, బాధితుల కథనం మేరకు.. ద్విచక్రవాహనంపై వచ్చిన ముగ్గురు వ్యక్తులు దుకాణం ముందు భాగంలోని సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. ఇనుప చువ్వలగేటు, షట్టర్‌ను బద్దలు కొట్టారు. దుకాణం లోపలిభాగంలోని సీసీ కెమెరాలకు నల్లని రంగును స్ప్రే చేశారు. అనంతరం దుకాణంలోని 5 కిలోల వెండి వస్తువులు, రెండున్నర తులాల బంగారం, రూ.45 వేల నగదు ఎత్తుకెళ్లారు. తెల్లవారుజామున స్థానిక విఠలేశ్వరుని ఆలయంలో జరిగే కాగడా హారతికి వెళ్లేందుకు ఆకాష్ కుటుంబ సభ్యులు బయటకు వచ్చారు. దుకాణ ద్వారం తెరిచి ఉండటంతో దొంగతనం జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు సమాచారం అందించారు. సీఐ నైలునాయక్, ఎస్సై రవీందర్ చేరుకుని క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేయించారు. ఆకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.


దొంగతనం జరిగిన దుకాణం ముందు తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఖానాపూర్‌లో ఆహార అధికారి ఆకస్మిక తనిఖీలు

ఖానాపూర్, న్యూస్‌టుడే: నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని జిల్లా ఆహార అధికారి ప్రత్యూష అన్నారు. ఖానాపూర్ పట్టణంలో గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో రాందేవ్ కాస్మెటిక్స్ దుకాణంలో రూ.9 వేలు విలువైన గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. లారీ అడ్డా ప్రాంతంలోని రాణిగారి బిర్యాని దుకాణంలో తనిఖీలు చేపట్టారు. నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెస్టారెంట్‌లు నడపడానికి నిర్వాహకులు అనుమతి తీసుకోవాలని.. లేనిపక్షంలో రూ.5 లక్షలు జరిమానా, 6 నెలలు సీజ్ చేస్తామన్నారు. నమూనాల ఫలితాలు 20 రోజుల్లో వస్తాయని తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పద పద.. తడోబా..


సందడి చేస్తున్న సందర్శకులు



● విహరిద్దాం.. పులులను దగ్గరగా చూసేద్దాం

పెద్ద పులుల గాండ్రింపులు, జింకల పరుగులు, పచ్చని చెట్లు, చక్కని నీటి వనరులు.. వీటన్నింటినీ ఓ సఫారీ జీప్‌లో చూస్తూ అలా ప్రకృతిలో విహరించాలని ఎవరికైనా ఉంటుంది. నిత్యం ఒత్తిళ్లతో సహవాసం చేస్తున్న మనకు ప్రకృతిలో ఒకరోజు సేదతీరేందుకు చక్కటి ప్రాంతం తడోబా అభయారణ్యం. దేశంలో ప్రసిద్ధి గాంచిన అభయారణ్యాలలో ఇది ఒకటి. మహారాష్ట్రలో ఉన్న ఈ ప్రాంతం పులులకు పుట్టినిల్లు. విశాలంగా, అనేక రకాల వన్యప్రాణులకు నెలవైన ఈ అరణ్యాలను చూసేందుకు దేశ విదేశాల నుంచి విశేషంగా పర్యాటకులు తరలి వస్తుంటారు. వర్షాకాలంలో మూడు నెలలు మూసి ఉండగా.. ఇటీవలే తెరిచారు. వందల సంఖ్యలో సందర్శకులు వీక్షిస్తున్నారు.

-న్యూస్‌టుడే, బల్లార్ష

ఎలా చేరుకోవచ్చంటే..

మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లాలో ఉన్న ఈ అరణ్యం దాదాపు 1727 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉంది. ఇందులో 626 చ.కి.మీ. విస్తీర్ణంలో కోర్ జోన్ ఏర్పాటు చేశారు. అందులో వన్యప్రాణులు సంచరించేందుకు వీలు కల్పించారు. మిగిలిన ప్రాంతమంతా బఫర్ జోన్. రైలు, రోడ్డు, విమాన మార్గాల ద్వారా ఇక్కడికి చేరుకోవచ్చు. కుమురంభీం జిల్లా కేంద్రం నుంచి 120 కి.మీ. హైదరాబాద్ నుంచి 390 కి.మీ.లో దూరం ఉంటుంది. చంద్రపూర్ రైల్వే స్టేషన్ నుంచి వాహనాల సదుపాయం ఉంటుంది. విమాన మార్గంలో నాగపూర్ చేరుకుంటే అక్కడ నుంచి 150 కి.మీ. దూరంలో ఈ ప్రాంతం ఉంటుంది.

రోజులో రెండు సార్లు..

రోజూ ఉదయం 6 గంటలకు పర్యాటకులతో జిప్సీలు బయలు దేరతాయి. లోపల ఉదయం 10 గంటల వరకు సంచరిస్తుంటాయి. మళ్లీ మధ్యాహ్నం రెండున్నర నుంచి సాయంత్రం ఆరున్నర గంటల వరకు పర్యటన ఉంటుంది. చరవాణులు, ప్లాస్టిక్ బాటిళ్లు, ప్లాస్టిక్ కవర్లలోని తినుబండారాలను అనుమతించరు.




చెరువు వద్ద కూనలతో సేదతీరుతున్న పులి

పులులే ఆకర్షణ..

ఇక్కడ 100కు పైగా పెద్దపులులు, 64 చిరుతలు, ఎలుగు బంట్లు, అడవి బర్రెలు, జింకలు, నెమళ్లు, వివిధ రకాల వన్యప్రాణులు ఉన్నాయి. ఈ అరణ్యాలలో తడోబా, కోడసా అనే ప్రధాన చెరువులతోపాటు అంధేరీ నది పరీవాహక ప్రాంతం ఉంటుంది. వన్యప్రాణులు దాహార్తి తీర్చుకునేందుకు సహజసిద్ధమైన కొలనులను సైతం అటవీ అధికారులు ఏర్పాటు చేశారు.

24 రోజుల్లో అయిదు వేల మంది..

అభయారణ్యాలలో ఈ నెల 1వ తేదీ నుంచి పర్యాటకులను అనుమతినివ్వగా.. ఇప్పటి వరకు 5,250 మంది సందర్శించినట్లు అటవీ అధికారులు ప్రకటించారు.

సందర్శన ఇలా..

సందర్శించేందుకు పర్యాటకులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. అభయారణ్యాల లోపలికి ఆరు మార్గాల ద్వారా పర్యాటకులను అనుమతిస్తారు. నాగపూర్ నుంచి వచ్చే వారికి కోలార, చంద్రపూర్ మార్గం గుండా వెళ్లేవారికి మోహర్లీ ద్వారం అనుకూలంగా ఉంటాయి. పర్యాటకుల కోసం మోహర్లీ వద్ద 32, కోలార వద్ద 12, నవేగావ్ వద్ద 6, కుంటవండా 4, జరీ 4, పంగడి 2.. ఇలా 60 ఓపెన్ టాప్ జిప్సీలు ఉంటాయి. ఒక జిప్సీలో ఆరుగురిని మాత్రమే అనుమతిస్తారు. డ్రైవర్‌తోపాటు ఒక గైడ్ ఉంటారు. పర్యాటకుల కోసం ప్రతి ద్వారం వద్ద ప్రత్యేక వసతి గృహాలు ఉన్నాయి. ప్రతి మంగళవారం సెలవు. వారాంతపు రోజుల్లో ప్రతి జిప్సీకి రూ.7,100, మిగిలిన రోజులలో రూ.6,100 ఫీజు వసూలు చేస్తారు.

'మాయా' ప్రత్యేకం

ఇక్కడ మాయా అనే పులిని రారాజుగా పిలుస్తారు. దీన్ని చూసేందుకు ప్రముఖ క్రికెటర్ సచిన్ తెందూల్కర్ ఏటా కుటుంబ సమేతంగా వస్తారు. మూడురోజులపాటు ఇక్కడ సేద తీరుతారు. ఇవే కాక తార, నయనతార అనే పులులు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. తెలుగు సినిమా హీరో నాగ చైతన్య సైతం తరచూ తడోబాను సందర్శిస్తారు.

'జైనూర్ ఘటన ప్రభుత్వ వైఫల్యమే'


మాట్లాడుతున్న ఖలీదా పర్వీన్, చిత్రంలో అబ్దుల్ ఖదీర్, అబ్దుల్ అజీజ్, శారా మాథ్యూ, డా.కుమార్, ఎంఏ షకీల్, సయ్యద్ మాజిద్

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఆసిఫాబాద్ ప్రాంతం జైనూర్‌లో మూక దాడి, దుకాణాల కాల్చివేత ప్రభుత్వ వైఫల్యంతోనే జరిగిందని పలువురు సామాజిక కార్యకర్తలు పేర్కొన్నారు. కుగ్రామంలో వందలాది మంది గుమిగూడుతున్న విషయాన్ని ప్రభుత్వ నిఘా సంస్థలు గుర్తించలేకపోయాయా? విషయం తెలిసినా వదిలేశారా? అని ప్రశ్నించారు. సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం సామాజిక కార్యకర్తలు ఖలీదా పర్వీన్, శారా మాథ్యూ, మహమ్మద్ అబ్దుల్ అజీజ్, డా.కుమార్ మాట్లాడుతూ.. జైనూర్‌లో దాడి చేసిన వారెవ్వరూ స్థానికులు కాదన్నారు. ఈ దాడుల్లో దాదాపు రూ.50కోట్ల ఆస్తి నష్టం జరిగిందన్నారు. వరుస ఘటనలు చూస్తుంటే కాంగ్రెస్ పాలనలా కాకుండా భాజపా పాలనగా కనిపిస్తోందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం సెక్యులర్‌గా ఉండాలని కోరుకుంటున్నామన్నారు. నిందితులను శిక్షించడంతో పాటు నష్టపోయిన వారికి పరిహారం చెల్లించాలన్నారు. సమావేశంలో న్యాయవాది ఎంఏ షకీల్, సామాజిక కార్యకర్తలు సయ్యద్ మాజిద్ షుత్తరి, సయ్యద్ మహమ్మద్ అబ్దుల్ ఖదీర్ అలీమ్‌ఖాన్ ఫలాకి తదితరులు ఉన్నారు.

గ్రంథాలయాలకు మంచి రోజులు

● జ్ఞాన తెలంగాణగా తీర్చిదిద్దుతాం ● ఉచిత విద్యుత్తు అందిస్తాం

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ సాంస్కృతికం :

రానున్న మూడు నెలల్లో గ్రంథాలయాలకు మంచి రోజులు వస్తాయని, రాష్ట్రాన్ని జ్ఞాన తెలంగాణగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ డా.రియాజ్ స్పష్టం చేశారు. ఉచిత విద్యుత్తు అందించాలని ముఖ్యమంత్రికి నివేదిస్తామని తెలిపారు. వరుస ఉద్యోగ ప్రకటనలతో గ్రంథాలయాలకు నిరుద్యోగ అభ్యర్థులు, పాఠకులు వస్తున్నా వారికి సరైన పుస్తకాలు అందుబాటులో లేవని.. సొంత భవనాలు, విద్యుత్తు, మూత్రశాలలు, తాగు నీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నారని న్యూస్‌టుడే సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన పైవిధంగా సమాధానమిచ్చారు. గురువారం ఆదిలాబాద్‌కు వచ్చిన ఆయనతో 'న్యూస్‌టుడే' ముఖాముఖి నిర్వహించింది.


రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ డా.రియాజ్‌తో

ముఖాముఖి

? **న్యూస్‌టుడే :** కొత్త మండలాల్లో గ్రంథాలయాలు లేవు. పాఠకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు?

డా.రియాజ్ : త్వరలో కొత్త మండలాల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తాం. సొంత భవనాల నిర్మాణం కోసం గ్రామ పంచాయతీ పరిధిలో స్థలాలను పరిశీలిస్తున్నాం.

? లైబ్రేరియన్ల కొరతతో గ్రంథాలయాలు మూసే ఉంటున్నాయి?

ఒక్కో లైబ్రేరియన్ మూడేసి గ్రంథాలయాల బాధ్యతలు చేపడుతున్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో గ్రంథాలయ శాఖలో ఉద్యోగ నియామకాలు చేపట్టలేదు. ఈ విషయం గురించి ముఖ్యమంత్రితో చర్చిస్తాం. రానున్న ఉద్యోగ ప్రకటనలో గ్రంథాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తాం. త్వరలో 33 జిల్లాలకు గ్రంథాలయ సంస్థ ఛైర్మన్లను నియమిస్తాం.

? పోటీ పరీక్షలకు సంబంధించిన కొత్త ముద్రణ పుస్తకాలు సరిపోవడం లేదు.

చిక్కడపల్లి గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలు, దిన, వార, పక్ష, మాస పత్రికలు అన్నీ గ్రంథాలయాల్లో ఉండేలా చర్యలు తీసుకుంటాం. కొత్త ముద్రణ పుస్తకాలు అందుబాటులో ఉంచుతాం. దాతలు కూడా సహకరించి పుస్తకాలు అందిస్తున్నారు.

? ఏళ్లుగా సెస్సు నిధులు రాక గ్రంథాలయాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. ఎలాంటి చర్యలు తీసుకోనున్నారు?

అవును నిజమే. మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల నుంచి గ్రంథాలయాలకు రూ.కోట్లలో సెస్సు రావాల్సి ఉంది. గత ప్రభుత్వం వీటి గురించి అసలు ఆలోచించలేదు. మున్సిపాలిటీ, డీపీవో శాఖలతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తాం. రానున్న రోజుల్లో సెస్సు వసూలు చేసి అభివృద్ధి పనులకు కేటాయిస్తాం.

? వరుస ఉద్యోగ ప్రకటనల నేపథ్యంలో గ్రంథాలయాలకు అభ్యర్థుల తాకిడి పెరుగుతోంది. పఠన గదులు సరిపోక అభ్యర్థులు ఇబ్బంది పడుతున్నారు.

నిజమే. ముఖ్యంగా మహిళలకు ప్రత్యేకంగా పఠన గదులు ఏర్పాటు చేస్తాం. అవసరమైన కుర్చీలు, బెంచీలు, ప్యాడ్లు సమకూరుస్తాం.


105 కిలోల గంట ఏర్పాటు

బేల, న్యూస్‌టుడే : బేల మండల కేంద్రంలోని విఠల్, రుకుంబాయి ఆలయ ప్రధాన ద్వారం వద్ద భక్తుడు పండరీనాథ్ 105 కిలోల భారీ గంటను ఏర్పాటు చేశారు. నాలుగేళ్ల కిందట ఇంటి ఆవరణలో సుందర ఆలయాన్ని నిర్మించిన ఆయన గురువారం భారీ గంటతో పాటు కలశాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో హోమం చేశారు. అన్నదానం ఏర్పాటు చేశారు.


భారీ గంటకు పూజలు చేస్తున్న పండరీనాథ్ కుటుంబ సభ్యులు

ఆర్‌పీఎల్‌ఐలో ఆదిలాబాద్ డివిజన్ తొలిస్థానం

భుక్తాపూర్(ఆదిలాబాద్), న్యూస్‌టుడే : ఇటీవల దేశవ్యాప్తంగా గ్రామీణ తపాలా జీవిత బీమా(ఆర్‌పీఎల్‌ఐ) మేళా జరిగిందని, అందులో తెలంగాణ సర్కిల్ అయిదో స్థానంలో నిలిచిందని ఉమ్మడి జిల్లా తపాలా పర్యవేక్షకుడు దేవిరెడ్డి సిద్ధార్థ తెలిపారు. తెలంగాణ సర్కిల్‌లో ఆదిలాబాద్ డివిజన్ మొదటి స్థానంలో ఉండటం గర్వంగా ఉందన్నారు. రూ.11,20,000 ప్రీమియం వసూలైనట్లు పేర్కొన్నారు. సిబ్బంది సహాయ సహకారాలతోనే ఈ ఘనత సాధించామన్నారు. ప్రతి ఒక్కరూ గ్రామీణ తపాలా జీవిత బీమా చేసుకోవాలని, అది భవిష్యత్తులో అత్యవసరాల్లో ఎంతో ఉపయోగపడుతుందన్నారు.


ఉమ్మడి జిల్లా తపాలా పర్యవేక్షకుడు దేవిరెడ్డి సిద్ధార్థ

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: బెల్లంపల్లి పట్టణంలోని కాసిపేట సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో గురువారం నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అండర్-19 కబడ్డీ పోటీల్లో 15 మంది బాలికలు, 15 మంది బాలురు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన నందిని, వైష్ణవి, శ్రీజ, శ్రీవల్లి, అంజలి, గంగ, అశ్విత, శిరీష, అనూష, సింధు, వేణుప్రియ, అక్షయ, సన్నిహిత, సనాఅంజుమ్, శ్రుతి, అభిషేక్, అంజన్న, వంశీకృష్ణ, కార్తిక్, వంశీ, మల్లేష్, అశ్విత్, జయవర్ధన్, అసద్, రాము, వినయ్, అభిషేక్, రామ్‌చరణ్‌తేజ, శ్రీమన్, క్రాంతి, ఆదర్శ్‌లు ప్రతిభ కనబర్చి ఎంపికయ్యారు. వీరంతా నవంబరు 3వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నారు.


ఎంపికైన క్రీడాకారులతో అధికారులు

హైకోర్టును ఆశ్రయించిన ఆర్జీయూకేటీ పూర్వ విద్యార్థి

ముధోల్(బాసర), న్యూస్‌టుడే : బాసరలోని ఆర్జీయూకేటీలో 2023లో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన తనకు యూనివర్సిటీ అధికారులు ధ్రువపత్రాలు ఇవ్వడం లేదంటూ పూర్వ విద్యార్థి సామల ఫణికుమార్ ఈ నెల 22న హైకోర్టును ఆశ్రయించాడు. విద్యార్థి తెలిపిన వివరాల ప్రకారం.. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో ఫీజులు బకాయిలున్నాయని చదువు పూర్తయిన విద్యార్థులకు యూనివర్సిటీ అధికారులు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదు. పై చదువులు, ఉద్యోగాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలుమార్లు విన్నవించినా సంబంధిత అధికారులు పట్టించుకోలేదని వాపోయాడు. ఈ నేపథ్యంలో గురువారం విచారణ చేసిన హైకోర్టు విద్యార్థికి సంబంధించిన వివరాలను తెలుసుకుని ఆర్జీయూకేటీకి నోటీసులు జారీ చేసింది. ఈ విషయమై 'న్యూస్‌టుడే' ఆర్జీయూకేటీ ఇన్‌ఛార్జి ఉపకులపతి గోవర్ధన్‌ను సంప్రదించగా తమకు ఎలాంటి నోటీసులు అందలేదన్నారు. కోర్టు నోటీసులు వస్తే వారి ఆదేశాల మేరకు వివరాలను తెలియజేస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఆసిఫాబాద్ : 80085 73640
కాగజ్‌నగర్ : 83418 12400
వాంకిడి : 94418 88006
కౌటాల : 94401 00066

న్యూస్‌టుడే, సిర్పూర్(టి)

? సిర్పూర్(టి) డౌనల్ ఏరియాలో గ్రామ పంచాయతీ ఎదురుగా ఉన్న రహదారి గుంతలమయంగా మారి దుమ్ము, ధూళితో నిండిపోతుంది. తాత్కాలికంగా రోడ్డుపై నీళ్లు పోయిస్తే దుమ్ము రాకుండా ఉంటుంది.
- బబ్లూ, సిర్పూర్(టి)

✔ నిత్యం నీళ్లు పట్టిస్తున్నాం. రహదారి మరమ్మతులకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. వారి ఆదేశానుసారం త్వరలోనే పరిష్కరిస్తాం.
- ఎస్.తిరుపతి, పంచాయతీ కార్యదర్శి, సిర్పూర్(టి)

న్యూస్‌టుడే, కాగజ్‌నగర్

? పట్టణంలోని మారుతీనగర్‌లో విద్యుత్తు దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. **- శంకర్, కాగజ్‌నగర్**

✔ విద్యుత్తు దీపాల ఏర్పాటుకు చర్యలు చేపడతాం.

? పట్టణంలోని సర్‌సిల్క్ ఏరియాలో రోడ్లు పగుళ్లు తేలి అధ్వానంగా మారాయి. గుంతలతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. **- సత్యరాజ్, కాగజ్‌నగర్**

✔ నూతన రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాం. నిధుల మంజూరు అనంతరం త్వరలోనే రోడ్ల నిర్మాణాలు చేపడతాం.
- అంజయ్య, కమిషనర్, కాగజ్‌నగర్

న్యూస్‌టుడే, ఆసిఫాబాద్

? జిల్లా కేంద్రంలోని బజార్‌వాడీ ఎస్సీ బాలికల వసతి గృహం సమీపంలోని చెత్త కుప్పలు తొలగించాలి. పందులు, పశువులు కుప్పపై చేరడంతో దుర్వాసన వస్తోంది. కాలువల్లో పూడిక నిండింది. తొలగించాలి.
- రహీం, కాలనీవాసి.

✔ వెంటనే పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. **- భుజంగ్‌రావు, పుర కమిషనర్**

ఇసుక దందాకు అడ్డేది?

వాగుల నుంచి అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా తరలింపు..


సిర్పూర్(టి) నుంచి ట్రాక్టర్‌లో..


పారిగాం వద్ద ఇసుక డంపులు

సిర్పూర్(టి), న్యూస్‌టుడే: తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం అక్రమ దందాలకు అడ్డాగా మారింది. సిర్పూర్(టి) మండలంలో ఇసుక అక్రమ దందా 'మూడు పూలు.. ఆరు కాయలు' అన్న చందంగా సాగుతోంది. ఈ ప్రాంతంలో ప్రాణహిత నదితో పాటు పలు వాగుల పాయలు ప్రవహిస్తున్నాయి. ప్రస్తుతం నీరు తగ్గిపోవడంతో అక్రమార్కులకు వరమైంది. అడ్డుకోవాల్సిన అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

మండలంలోని రాంబండ వాగు, లక్ష్మీపూర్ వాగు, పోచమ్మ గుడి వద్ద వాగు, పారిగాం వాగుల్లో నిత్యం పదుల సంఖ్యలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ఇసుక ట్రాక్టర్ ధర రూ.1200 నుంచి రూ.1400 వరకు విక్రయిస్తుండగా, హైదరాబాదుకు లారీ లోడుకు రూ.1.40 లక్షల చొప్పున తరలిస్తున్నారు. సిర్పూర్(టి) పక్కనే ఉన్న మహారాష్ట్రకు రూ.1800 నుంచి రూ.2000 చొప్పున నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నారు. అధికారులకు భారీగా ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

★ ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాస్‌ను న్యూస్‌టుడే సంప్రదించగా.. అక్రమ ఇసుక తవ్వకాలు జరిపే ఆయా ప్రాంతాల్లో పరిశీలిస్తామన్నారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నిబంధనలకు నీళ్లు!

సిర్పూర్(టి), పారిగాం గ్రామాల నుంచి ఇసుక మహారాష్ట్రలోని పోడ్సా, అన్నూర్, ధాబా తదితర గ్రామాలకు ఇసుక తరలిస్తున్నారు. మండలంలో జరిగే నిర్మాణాలకు తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అంతే కాకుండా తగినంత ఇసుక మాత్రమే నిల్వ చేసుకోవాలి. కానీ ఇవేవీ పాటించకుండా జేసీబీల ద్వారా వాగుల్లో తవ్వకాలు జరిపి అర్ధరాత్రి సమయంలో ట్రాక్టర్లలో సమీప గ్రామాల్లో డంపులు చేస్తున్నారు. అనంతరం లారీల్లో నింపుకొని హైదరాబాద్, తదితర ప్రాంతాలకు యథేచ్ఛగా తరలిస్తున్నారు. అయితే ఉదయం నుంచి సాయంత్రం వరకు కూడా పదుల సంఖ్యలో ఇసుక ట్రాక్టర్లు అక్రమంగా తరలిస్తున్నా అధికారులు అడ్డుకోవడం లేదు.

అసలే మూల మలుపు.. ఆపై ముళ్ల చెట్లు

సిర్పూర్(టి)-కౌటాల వెళ్లే ప్రధాన రహదారిలో రైస్‌మిల్లు సమీపంలో మూల మలుపు వద్ద ముళ్ల చెట్లు ప్రమాదకరంగా మారాయి. ఈ చెట్లు రోడ్డును సగం వరకు కమ్మేశాయి. వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మలుపు ఉండటంతో అటు నుంచి వచ్చే వాహనాలు తెలియక అక్కడే చెట్ల కొమ్మలు కమ్మేయడంతో ఆందోళనకరంగా మారింది. ప్రమాదం జరగకముందే చెట్ల కొమ్మలు తొలగించాలని గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, సిర్పూర్(టి)



పుస్తక పఠనంతో సృజనాత్మకత మెరుగు


పుస్తకాలను ప్రదర్శిస్తున్న ఎంఈవో మెకర్తి వెంకటేశ్వర్, ప్రధానోపాధ్యాయులు

రెబ్బెన, న్యూస్‌టుడే: మండలంలోని వంకులం గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మోడల్ గ్రంథాలయాన్ని గురువారం మండల విద్యాధికారి మోకార్తి వెంకటేశ్వర్ ప్రారంభించి మాట్లాడారు. పుస్తక పఠనం చేయడంతో పిల్లల్లో ఆలోచన, ఊహాశక్తి, కొత్త పదాలు తెలుసుకోవచ్చన్నారు. సృజనాత్మక శక్తి పెంచడం ద్వారా వారు కొత్త పుస్తకాలు రాసేందుకు అవకాశం ఉంటుందన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయంలో సుమారు 700 (తెలుగు, ఇంగ్లీష్) పుస్తకాలు ఉన్నట్లు తెలిపారు. రీడింగ్ బల్లలు, బీరువా, కార్పెట్లు, చిత్రాలు వేయడానికి సామగ్రిని అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విజయరాణి, మహేశ్వర్, పురుషోత్తం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.ప్రభాకర్, వినయ్ కుమార్, లతీఫ్, ఎస్‌వో-2 ఉప్పులేటి శ్రీనివాస్, సీఆర్పీలు దేవేందర్, రాజేష్, మహేశ్వర్, సత్యనారాయణ, రూమ్ టు రీడ్ జిల్లా ఇన్‌ఛార్జి జెన్నిఫర్, మండల కోఆర్డినేటర్ శ్రీనివాస్, చంద్రశేఖర్, రాజు పాల్గొన్నారు.

నేర వార్తలు

పాముకాటుతో యువకుడి మృతి


జీవన్‌దాస్

బెజ్జూరు, న్యూస్‌టుడే : మండలంలోని సోమిని గ్రామానికి చెందిన జంగం జీవన్‌దాస్(22) అనే యువకుడు పాము కాటుతో మృత్యువాత పడ్డారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జీవన్‌దాస్ బుధవారం తన పొలంలో కలుపు మొక్కలు తొలగిస్తున్న క్రమంలో పాము కాటేసింది. వెంటనే ఆయన కుటుంబీకులకు చరవాణిలో సమాచారమిచ్చారు. దీంతో వారు అతన్ని మహారాష్ట్రలోని అహేరి సామాజిక ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందినట్లు పేర్కొన్నారు.

సిందెవాహి అడవుల్లో చిరుత మృతి

బల్లార్ష, న్యూస్‌టుడే : మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా సిందెవాహి అడవుల్లోని నవర్‌గావ్ ఉప క్షేత్రంలో చిరుత పులి మృతిచెందింది. సిందెవాహి అటవీ అధికారి విశాల్ సాల్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. నవర్‌గావ్ ఉపక్షేత్రంలో గస్తీ తిరుగుతున్న సిబ్బందికి నీటి కుంట పక్కనే చిరుత కళేబరాన్ని గుర్తించారు. పశువైద్యాధికారి శాలినీ లోండె ఆధ్వర్యంలోని అటవీశాఖ బృందం ఘటనాస్థలానికి చేరుకొని శవపరీక్షలు నిర్వహించారు. మూడు నుంచి నాలుగేళ్ల వయసున్న మగ చిరుతగా నిర్ధారించారు. రెండు, మూడురోజుల కిందట మృతి చెంది ఉండవచ్చని తెలిపారు. చిరుత అవయవాలు సక్రమంగానే ఉన్నాయని, పరిసరాల్లోని పులి అడుగుజాడలు బట్టి రెండు పులుల మధ్య ఘర్షణతోనే మృతిచెంది ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. తర్వాత ఖననం చేశారు.


చిరుత కళేబరం

గ్యాస్ లీకేజీ.. ఇల్లు దగ్ధం


దగ్ధమైన ఇల్లు

బెజ్జూరు, న్యూస్‌టుడే : మండల కేంద్రానికి చెందిన కంపెల వెంకటేష్ ఇంట్లో గురువారం ఉదయం వంట చేస్తున్న క్రమంలో గ్యాస్ సిలిండర్ లీకేజీ అయి మంటలు చెలరేగడంతో ఇల్లు దగ్ధమైంది. అప్రమత్తమైన ఇంట్లోని వారు బయటకి వచ్చి కేకలు వేయడంతో కాలనీవాసులు మంటలను ఆర్పేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. మంటల్లో 30 కిలోల బియ్యం, తినుబండారాలు, ఇతర వస్తువులు కాలిపోయాయి. ఇంటి పెంకులు ధ్వంసమయ్యాయి. సుమారు రూ.లక్షకు పైగా ఆస్తినష్టం వాటిల్లింది. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో.. తహసీల్దార్ భూమేశ్వర్, సీనియర్ అసిస్టెంట్ అచ్యుత్‌రావులు ఘటనా స్థలానికి వచ్చి పంచనామా నిర్వహించారు.

నాటుసారా స్థావరంపై దాడి.. ముగ్గురిపై కేసు

సిర్పూర్(టి), న్యూస్‌టుడే: జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారిణి బి.జ్యోతికిరణ్ ఆదేశాల మేరకు.. కాగజ్‌నగర్ ఎక్సైజ్ అధికారులు మండలంలోని జక్కాపూర్ గ్రామంలో గురువారం నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. 15 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని దుర్గే చందర్, దుర్గే యశ్వంత్, కాప్లే శ్రీనులపై కేసు నమోదు చేసినట్టు కాగజ్‌నగర్ అబ్కారీ సీఐ రవి తెలిపారు. దాడుల్లో ఎస్సై రాజేశ్వర్, వీరాస్వామి, నవీన్, సాయికిరణ్ పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

చింతలమానెపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని గూడెం గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద గురువారం 20 లీటర్ల గుడుంబాను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై ఇస్లావత్ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు చేపట్టామన్నారు. మండలంలోని దిందా గ్రామానికి చెందిన దుర్గం బాపు 20 లీటర్ల గుడుంబాను తరలిస్తున్న క్రమంలో పట్టుకున్నామని తెలిపారు. స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఏఎస్సై యాదవ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

యువతిని మోసం చేసిన వ్యక్తికి జైలు

కాగజ్‌నగర్: పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం.వీ రమేష్ గురువారం తీర్పునిచ్చినట్టు కాగజ్‌నగర్ టౌన్ సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. మారుతీనగర్‌లో నివసించే యువతి ఇంట్లో అద్దెకుంటున్న నాగనూరి అశోక్ పెళ్లి చేసుకుంటానని చెప్పి నిరాకరించడంతో యువతి ఫిర్యాదు మేరకు 2019 డిసెంబర్ 21న కేసు నమోదు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించి విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో శిక్ష ఖరారు చేసినట్టు సీఐ వివరించారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం.. కేసు నమోదు

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గన్నారం మహాత్మాజ్యోతిబా పులే బాలికల పాఠశాల, కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని గురువారం అదృశ్యమైనట్లు ఈజ్‌గాం పోలీసులకు ఫిర్యాదు అందింది. గురువారం మధ్యాహ్నం నుంచి సదరు విద్యార్థిని కళాశాలలో కనిపించకపోవడంతో సిబ్బంది పరిసరాల్లో గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదు. కొత్తగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపల్ సెలవుపై వెళ్లారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సంగీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రామనకుమార్ తెలిపారు.

భీం ఆశయ సాధనకు కృషి


లింబగూడలో జెండా వద్ద పూజలు చేస్తున్న ఆదివాసీ గిరిజనులు

కెరమెరి, న్యూస్‌టుడే : పోరాట యోధుడు కుమురం భీం ఆశయాల సాధనకు కృషి చేస్తామని భీం ఉత్సవ కమిటీ ఛైర్మన్ పెందుర్ రాజేశ్వర్, కన్వీనర్ పెందుర్ మోతీరాం అన్నారు. భీం వర్ధంతి వారోత్సవాలలో భాగంగా.. గురువారం మండలంలో కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో జెండా ఆవిష్కరించి భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంప్రదాయం ప్రకారం భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. భీం చేసిన పోరాటాలను స్మరించుకున్నారు. జడ్పీటీసీ మాజీ సభ్యులు ఆత్రం లక్ష్మణ్, సెడ్మాకి ద్రుపతబాయి, నాయకులు కోవ విజయ్, జగన్నాథ్‌రావ్, ఆనంద్‌రావ్, రఘునాథ్, కనక ప్రభాకర్, బోజ్జిరావ్ తదితరులు పాల్గొన్నారు.


కెరమెరిలో భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆదివాసీ నాయకులు

కుమురంభీం జెండా ఆవిష్కరణ

వాంకిడి: మండలంలోని లింబగూడ చౌరస్తాలో గురువారం వెల్గి రాయిసెంటర్ ఆధ్వర్యంలో కుమురంభీం జెండా ఆవిష్కరించారు. ఈసందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన జెండా వద్ద గిరిజన సంప్రదాయబద్ధంగా వాయిద్యాలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథులుగా డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, ఐటీడీఏ డైరెక్టర్ సోయం భీంరావు, సర్‌మెడి మెస్రం దేవ్‌రావు, ఆదివాసీ సంఘాల నాయకులు మడావి భీంరావు, ఉయిక రాము, అంబారావు, మనోహర్, కిషన్‌రావు వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఆదివాసీలు పాల్గొన్నారు.

కార్యక్రమం నిర్వహించి.. అవగాహన కల్పించి


కౌటాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రమేష్

కౌటాల, న్యూస్‌టుడే : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా.. గురువారం కౌటాల సర్కిల్ కార్యాలయంలో సీఐ ముత్యం రమేష్ ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పోలీసుల విధులు, ఆయుధాలు, ఖైదీల గదులు, షీటీం నిర్వహణపై అవగాహన కల్పించారు. పోలీస్‌స్టేషన్ అంటే భయం వీడాలని.. ప్రజల కోసమే తాము బాధ్యతలు నిర్వహిస్తున్నామని సీఐ సూచించారు. కార్యక్రమంలో ఎస్సై మధుకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు..

పెంచికల్‌పేట్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా.. మండలంలోని ఎల్లూర్ ఆశ్రమ పాఠశాలలో ఎస్సై కొమురయ్య ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'తెలంగాణలో డ్రగ్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర' అనే అంశంపై పరీక్ష రాశారు. అనంతరం బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు గోపాల్ రెడ్డి, ఉపాధ్యాయుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి..

తిర్యాణి: పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివని తిర్యాణి ఎస్సై మాధవ్ అన్నారు. సంస్మరణ దినోత్సవాల సందర్భంగా గురువారం రాత్రి మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తాలో యువకులతో కొవ్వొత్తులతో అమరులకు నివాళులు అర్పించారు.

తుంగెడలో వైద్య శిబిరం


రక్త పరీక్షలు చేస్తున్న హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్

రెబ్బెన, న్యూస్‌టుడే: మండలంలోని తుంగెడ గ్రామంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జ్వరాలతో బాధపడుతున్న వారి నుంచి రక్త నమూనాలు సేకరించారు. ముందుగా వైద్య, గ్రామ పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ తిరిగి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఖాళీ పాత్రలు, పాత కూలర్లు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లలో నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారంలో ఒక రోజు ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సుజన, ఎంఎల్‌హెచ్‌పీ రుచిత, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్, ఏఎన్‌ఎం తులసి, ఆశా కార్యకర్త వినోద, నాయకుడు పూదరి హరీశ్, పంచాయతీ కార్యదర్శి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై గ్రామసభ


బారెగూడలో అవగాహన కల్పిస్తున్న ఏపీఓ బుచ్చన్న

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో కూలీల వలసలు తగ్గించేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న అభివృద్ధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ బుచ్చన్న అన్నారు. గురువారం మండలంలోని బారెగూడ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద 2025-26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న పనుల ప్రణాళిక రూపకల్పనపై గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ పథకంలో ఊటకుంటలు, ఫారంపాండ్, పండ్లతోటలు, పశువుల కొట్టాలు, గ్రామాల్లో అంతర్గత మట్టిరోడ్లు, ఇంకుడు గుంతలు తదితర పనులు చేపట్టవచ్చని వివరించారు. స్వచ్ఛ భారత్ మిషన్ పథకంలో వ్యక్తిగత మరుగుదొడ్లు కూడా నిర్మించుకోవచ్చని పేర్కొన్నారు. ప్రత్యేకాధికారి దేవాజీ, సాంకేతిక సహాయకురాలు దేవేంద్ర, క్షేత్ర సహాయకుడు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు

రెబ్బెన, న్యూస్‌టుడే: ఇందిరానగర్ గ్రామంలోని శ్రీకనక దుర్గాదేవి, స్వయంభు మహంకాళి ఆలయంలో గురువారం అష్టమి (భైరవాష్టమి) సందర్భంగా కాలభైరవ స్వామికి భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అష్టమి స్వామికి చాలా ప్రీతికరమైన రోజు కావడంతో మద్యం లేదా పాలతో అభిషేకం చేసి నైవేద్యాలు సమర్పించారు. గుమ్మడికాయ దీపాలు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ప్రాంతంలో కాలభైరవ స్వామి ఏకైక ఆలయం ఇందిరానగర్‌లో ఉండటంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు దేవార వినోద్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

'హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం'


రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేస్తున్న భారాస నాయకులు

బెజ్జూరు, న్యూస్‌టుడే : హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని భారాస నియోజకవర్గ కో-కన్వీనర్ కొండ రాంప్రసాద్ ఆరోపించారు. ఆ పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఏరియాలో ప్రధాన రహదారిపై నాయకులు రాస్తారోకో చేపట్టారు. రైతు భరోసాకు డబ్బులు లేకపోవడంతోనే సబ్ కమిటీలు అంటూ డ్రామాలు వేస్తున్నారని దుయ్యబట్టారు. రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న ఎస్సై విక్రమ్ వచ్చి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూశారు. భారాస నాయకులు సూర్ల ఇస్తారి, ఖాజామైనోద్దీన్, దేవయ్య, మోహన్ రాందాస్, తిరుపతి, కిషోర్ పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాలు అమలు చేయాలని వినతి

జైనూర్, న్యూస్‌టుడే : ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరుతూ.. గోండ్వాన మార్లవాయి రాయిసెంటర్ సార్మేడి జుగ్నక దేవ్‌రావు, ఆయా రాయిసెంటర్ల సార్మేడిలు గురువారం డీటీ బీర్షావ్, ఎంపీడీవో సుధాకర్ రెడ్డిలకు వినతిపత్రాలు అందించారు. ఏజెన్సీ ప్రాంతంలో అధికారులు చట్టాలకు లోబడి పనిచేయాలన్నారు. జైనూర్ గ్రామ పటేల్ మాజీ జడ్పీటీసీ సభ్యుడు కొడప విశ్వంబర్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా నాయకుడు మారుతి, ఆయా రాయిసెంటర్ల సార్మేడీలు ఆత్రం ఆనంద్‌రావు, మెస్రం బాదిరావు, ఆత్రం మక్తుర్‌షావు, మడావి చంపత్‌రావ్, నాయకులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ టౌన్ సీఐ బాధ్యతల స్వీకరణ

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : కాగజ్‌నగర్ టౌన్ సీఐగా పి.రాజేంద్రప్రసాద్ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా పనిచేసిన శంకరయ్య బదిలీపై హైదరాబాద్ ఐజీ పోలీస్ కార్యాలయానికి వెళ్లారు. రామగుండం ట్రాఫిక్ సీఐగా విధులు నిర్వహించిన రాజేంద్రప్రసాద్ బదిలీపై కాగజ్‌నగర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా టౌన్ ఎస్సైలు రమేష్, సుధాకర్, అనిల్, కౌన్సిలర్లు జి.ఎల్లేష్, డోంగ్రె సునీల్, తాటి జైచందర్, నాయకులు వనమాల రాము, కీర్తి శ్రీనివాస్, రవి, తదితరులు సీఐకి శుభాకాంక్షలు తెలిపారు.

మూడో రోజు ఏడు నామినేషన్లు

బల్లార్ష, న్యూస్‌టుడే : మహారాష్ట్ర శాసనసభకు నవంబరు 20వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. ఈమేరకు నామపత్రాల స్వీకరణ కార్యక్రమం ఈ నెల 22 నుంచి ప్రారంభమైంది. చంద్రపూర్ జిల్లాలోని ఆరు శాసనసభ స్థానాలు ఉండగా.. మూడో రోజైన గురువారం ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి.

26న ఉద్యోగ మేళా

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని టాస్క్ తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ కేంద్రం (పాత కలెక్టరేట్ భవనం)లో ఈ నెల 26న ఉదయం 11 గంటలకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సతీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ అపోలో ఫార్మసీ సంస్థలో ఫార్మాసిస్టు-30, ట్రైనీ ఫార్మాసిస్టు-20, ఫార్మసీ అసిస్టెంట్-20 చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటి కోసం ఎస్ఎస్‌సీ/ఇంటర్/డిగ్రీ/డీ-ఫార్మసీ/బీ-ఫార్మసీ/ఎం-ఫార్మసీ పీసీఐ పూర్తి చేసి 18-35 ఏళ్ల మధ్య వయసున్న అభ్యర్థులు అర్హులని వివరించారు. రిటైల్ ట్రైనీ అసోసియేట్ పోస్టులు-30 ఖాళీ ఉన్నాయన్నారు. వీటికి ఎస్ఎస్‌సీ/ఇంటర్/డిగ్రీ పూర్తి చేసిన 18-26 ఏళ్ల మధ్య వయసున్న వారు అర్హులని పేర్కొన్నారు.

ఓటు నమోదుపై ఉపాధ్యాయులకు అవగాహన


ఉపాధ్యాయులకు ఓటరు నమోదు పత్రాన్ని అందజేస్తున్న పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ఉపాధ్యాయులు ఓటు నమోదు చేసుకోవాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాసరావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కస్తూర్బా, జడ్పీఎస్ఎస్ బాలురు, బురుగూడ పాఠశాలల్లో ఉపాధ్యాయులతో సమావేశమై ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. ఉన్నత పాఠశాలల్లో కనీసం మూడేళ్ల అనుభవం ఉన్న ఉపాధ్యాయులకు పత్రాలు అందజేశారు. పూర్తి చేసిన ఫారాలను నవంబరు 3లోగా సంబంధిత ఎమ్మార్వోకు గాని ఎంఈవోకు గాని సమర్పించాలని సూచించారు. పీఆర్టీయూ టీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అధికారికంగా ప్రకటించిన వంగ మహేందర్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి సునార్కర్ అనీల్, కుమ్మరి రవి, దాసరి రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

సమయానికి బస్సు వచ్చేలా చూడాలని వినతి

రెబ్బెన: మండలంలోని నంబాల గ్రామ జడ్పీ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేసినట్లు ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం తెలిపారు. ఉదయం బస్సు సమయానికి వస్తున్నా సాయంత్రం సమయానికి రాకపోవడంతో నారాయణపూర్, కిష్టాపూర్, జక్కులపల్లి, కొమురవెల్లి, రాజారాం గ్రామాలకు చెందిన విద్యార్థులు ఇళ్లకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. ఒక్కోసారి సాయంత్రం 7 గంటల వరకు రాకపోవడంతో రోడ్డుపై విద్యార్థులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నంబాలకు సాయంత్రం 5 గంటలకు బస్సు వచ్చేలా సహకరించాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమీక్ష

కెరమెరి: త్వరలో చేపట్టనున్న కులగణనను పకడ్బందీగా నిర్వహించాలని జడ్పీ సీఈవో, ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. నీరు కలుషితం కాకుండా వాటర్ ట్యాంక్ మరమ్మతులు ఉంటే వెంటనే చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పనులపై గ్రామ సభలు నిర్వహించాలన్నారు. అంతకుముందు రాంజీగూడ ఆశ్రమ పాఠశాలు తనిఖీ చేశారు. తహసీల్దార్ దత్తు ప్రసాద్, ఎంపీడీవో అమ్జద్ పాషా, ఏపీవో మల్లయ్య, హెచ్‌ఎం ప్రేమ్‌దాస్ తదితరులున్నారు.

చెకుముకి పోటీల గోడప్రతుల విడుదల

ఆసిఫాబాద్ అర్బన్: నవంబరు 7న ప్రారంభం కానున్న చెకుముకి పోటీల ప్రచార గోడ ప్రతులను గురువారం జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులతో కలిసి జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు విడుదల చేశారు. జనవిజ్ఞాన వేదిక, తెలంగాణ పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించే ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొనేలా ఉపాధ్యాయులు చూడాలని వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్లూరి రాజేశ్ కోరారు. హేమంత్ షిండే, సంజయ్‌కుమార్, ఉపాధ్యాయుల పాల్గొన్నారు.

లాటరీ నిర్వహిస్తే కఠిన చర్యలు

వాంకిడి: దీపావళి పండగ నేపథ్యంలో ఎవరైనా లక్కీడ్రా పేరుతో లాటరీ నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై ప్రశాంత్ హెచ్చరించారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ కొంత మంది నిబంధనలకు విరుద్ధంగా లక్కీ లాటరీలు నిర్వహిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ప్రజలు మోసపోవద్దని సూచించారు. ఎవరైనా నిర్వహిస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

గ్రామాల్లో పశువైద్య శిబిరాలు

తిర్యాణి: మండలంలోని మణిక్యాపూర్, భీంపూర్ గ్రామాల్లో గురువారం పశువైద్య శిబిరాలు నిర్వహించినట్లు పశువైద్యాధికారి సాగర్ తెలిపారు. శిబిరంలో 374 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు వివరించారు. సిబ్బంది సురేష్, మనోహర్, సంతోష్, రాకేష్ తదితరులున్నారు.

గిరిజన ఏకోపాధ్యాయ పాఠశాలల తనిఖీ

తిర్యాణి: మండలంలోని గిన్నెధరి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ఐటీడీఏ ఏకోపాధ్యాయ పాఠశాలలను గురువారం జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి (ఏసీఎంవో) ఉద్ధవ్ తనిఖీ చేశారు. పెద్దగూడ, కోర్లోంక, నాయకపుగూడ, చెలిమల, చిన్నఅరటిపల్లి, ఇర్కపల్లి పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్ఈఆర్పీలు యాదవ్‌రావు, యశ్వంత్‌రావు తదితరులున్నారు.

సరిహద్దు రాష్ట్రాల పోలీసు అధికారులతో సీపీ భేటీ

గోదావరిఖని: మూడు రాష్ట్రాల సరిహద్దు పోలీసు అధికారులతో రామగుండం పోలీసు కమిషనర్ ఎం.శ్రీనివాస్ గురువారం సమావేశమయ్యారు. మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్రంతోపాటు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన సరిహద్దు జిల్లాల పోలీసు అధికారులు సమావేశమయ్యారు. గడ్చిరోలి ఎస్పీ క్యాంపు కార్యాలయంలో డీఐజీ అంకిత్‌గోయల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన సీపీ పలు అంశాలపై చర్చించారు. సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల ప్రభావం.. వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. సరిహద్దు రాష్ట్రాల చెక్‌పోస్టుల వద్ద నిత్యం తనిఖీలు నిర్వహించాలని, మూడు రాష్ట్రాలకు చెందిన సమాచారాన్ని పరస్పరం అందించుకుంటూ ముందుకు సాగాలన్నారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని వివరించారు. సీఆర్పీఎఫ్ డీఐజీ అజయ్‌శర్మ, ఆసిఫాబాద్, భూపాలపల్లి ఎస్పీలు రాబిన్‌సన్, శ్రీనివాసులు, మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఎస్బీ ఏసీపీ వి.రాఘవేంద్రరావుతో పాటు రెండు రాష్ట్రాల పోలీసు అధికారులు పాల్గొన్నారు.